తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం | 30 జూలై 2026
పేజీలు : 08



## నిబంధనలకు విరుద్ధంగా
# నారాయణ కాలేజీ వేళలా?

### రాత్రి 9 గంటల వరకు తరగతులు

- కాలేజీని తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యాధికారి కిసాన్
- విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారంటూ ఏఐవైఎఫ్ ఫిర్యాదు
- నిబంధనలు అమలు చేయకపోతే ఆందోళనకు హెచ్చరిక



**కాప్రా, జూలై 29 (జనంసాక్షి):**

బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలకు విరుద్ధంగా కమలానగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో రాత్రి 9 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) కిసాన్ కళాశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల ప్రకారం జూనియర్ కళాశాలలు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిర్వహించాల్సి ఉండగా, నారాయణ జూనియర్ కళాశాలలో ఆ నిబంధనలను ఉల్లంఘిస్తూ రాత్రి వరకు తరగతులు నిర్వహిస్తున్నారని ఏఐవైఎఫ్ నాయకులు సత్యప్రసాద్, ధర్మేంద్ర డీఐఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా తరగతుల సమయాలను పొడిగించడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని, వారి ఆరోగ్యం, విద్యాభ్యాసంతో పాటు కుటుంబ జీవితంపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని ఏఐవైఎఫ్ నాయకులు ఆరోపించారు. అదేవిధంగా కళాశాల యాజమాన్యం విద్యార్థులు, తల్లిదండ్రులను పలు విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొంటూ, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కళాశాల సమయాలను వెంటనే నిబంధనలకు అనుగుణంగా మార్చాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన

- ఒక్క ఓటు కూడా వదలకుండా సర్వే చేయాలి
- బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి



**కుల్కచర్ల, జులై 29 (జనం సాక్షి ):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మండల ప్రవాస్ అభియాన్ సందర్భంగా మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, కుసుమసముద్రం, గొరిగడ్డ తండా, పుట్టపాడు, ఘనపూర్ గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో, బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి, పార్టీ దీూా-2లు మరియు సంబంధిత దీూాలతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు, చిరునామా మార్పులు తదితర ప్రక్రియలను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కోరారు. అలాగే ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.ఒక్క ఓటు కూడా వదలకుండా సర్వే చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గణపురం వెంకటయ్య, సర్పంచ్ వార్వల్ల అంజిలయ్య,గ్రామ ఉపసర్పంచ్ విజయ్ కుమార్, పరిగి అసెంబ్లీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ కేశవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్, బీజేపీ నాయకులు నరసింహ,జాజుల అనిల్, ఆంజనేయులు, నరేష్, మొనాచారి, బుచ్చన్న, దోమ రమేష్,గడుసు మహిపాల్, హనుమంతు, నరేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణకు కొత్త దిశ



### నిమ్స్-సటోరు భాగస్వామ్యం..

- డిమెన్షియా బాధితులకు ఉచిత మానసిక-సామాజిక సేవలు
- ఏటా 15 వేల మంది వృద్ధులకు ప్రయోజనం
- కుటుంబ సభ్యులకు ప్రత్యేక శిక్షణ, కౌన్సెలింగ్
- ఆయుష్మాన్ భారత్ నమోదు, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

లోపలి పేజీలో

*వృద్ధులు, డిమెన్షియా (మతిమరుపు), ఇతర న్యూరోడిజెనరేటివ్ వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పంజాగుట్టలోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్), సటోరు ఫౌండేషన్ కీలక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టాయి. ఇరు సంస్థలు అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకోగా, ఒప్పంద పత్రాలను నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. రాహుల్ దేవరాజ్, సటోరు ఫౌండేషన్ డైరెక్టర్ కనగాల సాయి చరణ్ పరస్పరం మార్చుకున్నారు.*



## చెరువుల పరిరక్షణ పేరుతో పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలి

- చెరువులను కాపాడటం వేరు.. పేదల బతుకులను కూల్చడం వేరు
- పునరావాసం లేకుండా ఇళ్ల కూల్చివేతలు అన్యాయం: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- అభివృద్ధి పేరుతో ప్రజలను రోడ్డున పడేయొద్దని హెచ్చరిక
- ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం

లోపలి పేజీలో

## మాదాపూర్ పోలీస్ స్టేషన్లలో
# సీపీ ఆకస్మిక తనిఖీ

### లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సేవలపై సమగ్ర సమీక్ష

- శాస్త్రీయ ట్రాఫిక్ నిర్వహణపై అధికారులకు ఆదేశాలు
- ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచన
- ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను కూడా పరిశీలించిన సీపీ



**శేరిలింగంపల్లి, జూలై 29 (జనంసాక్షి):** సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ బుధవారం మాదాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించి అక్కడి మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవలు, ట్రాఫిక్ నిర్వహణ విధానం, పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్‌లలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో శాస్త్రీయ విధానాలతో ట్రాఫిక్ నిర్వహణ చేపట్టి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్‌లలో పరిశుభ్రత, మౌలిక వసతుల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, సిబ్బంది మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సీపీ స్పష్టం చేశారు. అనంతరం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి ట్రాఫిక్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణ విధానాన్ని పరిశీలించారు. విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం, మర్యాదపూర్వక ప్రవర్తన, ప్రజా సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సమయంలో వాహనదారులు, ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరించాలని, చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూనే ప్రజల గౌరవానికి భంగం కలగకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతి చర్యలో పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి, వృత్తిపరమైన నడవడిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ట్రాఫిక్ డీసీపీ రవికుమార్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణ పేరుతో పేదల ఇళ్ల కూల్చివేతలు ఆపాలి

**ఉప్పల్, జూలై 29 (జనంసాక్షి):** చెరువుల పరిరక్షణ పేరుతో దశాబ్దా లుగా నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చివేయడం సమర్థనీయం కాదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి అన్నారు. చెరువుల అభివృద్ధికి తాము పూర్తి మద్దతు ఇస్తామని, అయితే అభివృద్ధి పేరుతో అమాయక ప్రజల ఇళ్లపై బుల్డోజర్లు నడపడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు, నీటి వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతేనని, అక్రమ ఆక్రమణలను తొలగించడం అవసరమేనని పేర్కొన్నారు. అయితే అదే పేరుతో పేదలను లక్ష్యంగా చేసుకుని, ప్రత్యామ్నాయ పునరావాసం కల్పించకుండా ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని విమర్శించారు. ప్రజలకు మేలు చేసే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి తాను మద్దతుగా నిలుస్తానని, చెరువుల అభివృద్ధి అంశంపై ఇప్పటికే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో చర్చించినట్లు తెలిపారు. చెరువుల అభివృద్ధి జరగాల్సిందే కానీ అది పేదల బతుకులను బలిచేసే విధంగా ఉండకూడదని స్పష్టం చేశారు. పేదల కన్నీళ్లపై నిర్మించే అభివృద్ధి నిజమైన ప్రజా అభివృద్ధి కాదని ఎమ్మెల్యే అన్నారు. చట్టబద్ధమైన పరిష్కారం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా ఇళ్లను కూల్చివేస్తే బాధిత కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ప్రజల ఆస్తులు, వారి భవిష్యత్తు కంటే ఏ అధికారి కూడా గొప్పవాడు కాదని పేర్కొంటూ, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తేవడం మానుకోవాలని హెచ్చరించారు.

ప్రజల సమస్యలను విస్మరించి ఏకపక్షంగా వ్యవహరిస్తే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. "చెరువులు పరిరక్షించాలి... పేదల బతుకులు కూడా పరిరక్షించాలి. అభివృద్ధి కావాలి... కానీ ప్రజలను నిరాశ్రయులను చేసే అభివృద్ధి కాదు" అని బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల హక్కులను కాపాడేందుకు ప్రజల పక్షాన నిలబడతామని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# ఓటరు జాబితా సవరణను వంద శాతం పూర్తి చేయాలి

- సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ సమీక్ష సమావేశం
- ప్రతి అర్హ ఓటరుకు నమోదు కల్పించాలని సూచన
- ఒకరికి ఒకే చోట ఓటు ఉండేలా జాబితా పరిశీలన
- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ పిలుపు



**మొయినాబాద్, జూలై 29 (జనం సాక్షి):** ఓటరు జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించాలని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ అన్నారు. మొయినాబాద్ మండల, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ప్రతినిధుల సమీక్ష సమావేశం బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇప్పటివరకు పంపిణీ చేసిన ఓటరు నమోదు ఫారాల పురోగతిని సమీక్షించారు. పంపిణీ చేసిన ప్రతి ఫారం తప్పనిసరిగా డిజిటలైజేషన్ పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు అందని అర్హులైన ఓటర్లను గుర్తించి వారికి వెంటనే ఫారాలు అందజేయాలని నాయకులకు సూచించారు. ఆగస్టు 3తో సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌ను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు జాబితా పూర్తి స్థాయిలో నవీకరించేలా బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని భీమ్ భరత్ కోరారు. ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండేలా జాబితాను పరిశీలించాలని, పట్టణం లేదా స్వగ్రామం ఎక్కడ ఓటు హక్కు ఉండాలో అక్కడ మాత్రమే నమోదు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన ఓటర్ల వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి జాబితాను సక్రమంగా సవరించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హ ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవాలని భీమ్ భరత్ పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మానయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సోనియా దర్శన్, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యలపై ప్రజలతో మమేకమై పనిచేయండి

**మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి.**



**తాండూరు జులై 29(జనంసాక్షి) :** స్థానిక సమస్యలపై నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పట్లోళ్ల దీప నర్సింలు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా పట్లోళ్ల దీప నర్సింలు మాట్లాడుతూ తాండూరు పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రోహిత్ రెడ్డి సూచనలు, మార్గదర్శనం మాకు ఎంతో ఉపయోగపడ తాయని అన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాము. పార్టీ బలోపేతానికి గడప గడపకు వెళ్లి ప్రజలకు సేవ చేస్తాం అని తెలిపారు. పైలెట్ రోహిత్ రెడ్డి కౌన్సిలర్లను అభినందిస్తూ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై నిరంతరం ప్రజలతో మమేకమై పనిచేయండి. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరవేసే బాధ్యత మనపై ఉంది.

తాండూరు అభివృద్ధికి నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది" అని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలు, స్థానిక అభివృద్ధి పనులపై చర్చించినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

# పర్యావరణ హితం.. పర్యాద జన్మదినం

**తాండూరు జులై 29(జనంసాక్షి) :** విద్యావేత్త పర్యాద రామకృష్ణ తన జన్మదినం సందర్భంగా తాండూరు పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణహితంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పర్యాద రామకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత మొక్కలు నాటడం వాటిని పరిరక్షించేందుకు కృషి ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడిన వాళ్ళం అవుతామని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షకులుగా మారి వృక్ష సంపద పెంచుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా సమాజంలో చైతన్యం తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిగ్రీ అధ్యాపకులు డా. మల్లేశం ,



పెరుమాళ్ల రాంరెడ్డి, అనంతరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, రాం సాగర్, విశాల్, సాయి, నవీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిమ్స్-సటోరు భాగస్వామ్యం..

# వృద్ధుల సంరక్షణకు కొత్త దిశ

**ఖైరతాబాద్, జూలై 29 (జనం సాక్షి):** ఈ ఒప్పందంతో నిమ్స్ న్యూరాలజీ, జెరియాట్రిక్ విభాగాల ఓపీడీలకు ప్రతి సంవత్సరం వచ్చే సుమారు 15 వేల మంది వృద్ధ రోగులకు ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా మానసిక-సామాజిక సహాయక సేవలు అందించనున్నారు. సటోరు ఫౌండేషన్‌కు చెందిన శిక్షణ పొందిన వాలంటీర్లు న్యూరాలజీ, జెరియాట్రిక్ వార్డులు, ఓపీడీలలో సేవలందిస్తూ డిమెన్షియా, ఇతర న్యూరోడిజెనరేటివ్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కౌన్సెలింగ్, జ్ఞాపకశక్తి సంబంధిత మార్గదర్శకత్వం, మానసిక ధైర్యాన్ని అందించనున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సూచనలు, సహకారం అందించనున్నారు. ఈ సేవలన్నీ నిమ్స్ వైద్య బృందం పర్యవేక్షణలో కొనసాగనున్నాయి.

ఒప్పందంలో భాగంగా డిమెన్షియా రోగుల కుటుంబ సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజువారీ సంరక్షణ, ప్రవర్తనా సమస్యలను ఎదుర్కొనే విధానాలు, సంరక్షకులపై మానసిక ఒత్తిడిని తగ్గించే మార్గాలపై అవగాహన కల్పించనున్నారు. దీంతో రోగులకు ఇంటి వద్ద మరింత మెరుగైన సంరక్షణ అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అర్హులైన వృద్ధులను ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకంలో నమోదు చేయడంలో కూడా సటోరు ఫౌండేషన్ సహకరించనుంది. అదేవిధంగా నర్సింగ్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ చివరి సంవత్సరం విద్యార్థులకు జెరియాట్రిక్, డిమెన్షియా సంరక్షణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిమ్స్, సటోరు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. వృద్ధుల సంరక్షణ, పడిపోకుండా నివారించే చర్యలు, మానసిక-సామాజిక సహాయక సేవలపై వారికి ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ దేశంలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి మరింత మానవీయమైన, గౌరవప్రదమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఈ భాగస్వామ్యం కీలక ముందడుగుగా నిలుస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన లాభాపేక్షలేని సంస్థ సటోరు ఫౌండేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వృద్ధులు, న్యూరోడిజెనరేటివ్ వ్యాధులతో బాధపడుతున్న వారు, వారి కుటుంబ సంరక్షకుల కోసం కమ్యూనిటీ స్క్రీనింగ్, కేర్‌గివర్ శిక్షణ, వృద్ధుల హక్కుల పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# తాండూరు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పంపిణీ 100శాతం పూర్తి

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు**



తాండూరు జులై 29(జనంసాక్షి)తాండూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజు మాట్లాడుతూ మొత్తం 269 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 2,52,235 మంది ఓటర్లకు ఫారాలు అందజేశారు. మండలాల వారీగా చూస్తే పెద్దేముల్, కోటేపల్లి, తాండూరు రూరల్, యాలాల్, బషీరాబాద్ మండలాల్లో 100 శాతం ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. తాండూరు అర్బన్ లో 73,959 మంది ఓటర్లలో మంగళవారం వరకు 73,958 ఫారాలు పంపిణీ కాగా, తర్వాత మరో 1 ఫారం పంపిణీ చేసి మొత్తం 100 శాతం పూర్తి చేశారు. డిజిటలైజేషన్ పరంగా నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,82,804 ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటల్ చేశారు. ఇది మొత్తంలో 72.47 శాతం. ఎఎస్ డి లను కూడా కలుపుకుంటే 2,15,559 ఫారాలు డిజిటలైజ్ కాగా, శాతం 85.46 కు చేరింది. ఇంకా 36,676 ఫారాలు డిజిటలైజ్ చేయాల్సి ఉన్నాయి. మండలాల వారీగా డిజిటలైజేషన్ వివరాలు... బషీరాబాద్. ముందు వరుసలో ఉంది. ఇక్కడ ఎఎస్ డి తో కలిపి 96.75 శాతం డిజిటలైజేషన్ పూర్తయింది. 41,321 మంది ఓటర్లకు 39,978 ఫారాలు డిజిటల్ అయ్యాయి. యాలాల్ లో 92.77 శాతం, పెద్దేముల్ లో 92.69 శాతం,కోటేపల్లి లో 92.11 శాతం నమోదైంది.తాండూరు రూరల్ లో 87.68 శాతం డిజిటలైజేషన్ జరిగింది.తాండూరు అర్బన్ లో 50,991 ఫారాలు డిజిటల్ కాగా, శాతం 68.94 గా ఉంది. ఇక్కడే 22,968 ఫారాలు ఇంకా బ్యాలెన్స్ లో ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తి కావడంతో తదుపరి ప్రక్రియగా మిగిలిన ఫారాల డిజిటలైజేషన్ పై దృష్టి పెట్టారు.

# తాండూరులో మానవత్వం చాటిన వినాయక ఆసుపత్రి

**ప్రతి నెల ఆది, గురువారాల్లో 100 మందికి ఉచిత వైద్యం.**

**వినాయక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సీఈఓ వర్ష ప్రశాంతి.**



తాండూరు జులై 29(జనంసాక్షి)తాండూరు పట్టణంలోని వినాయక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేద ప్రజలకు అండగా నిలుస్తోంది. ప్రతి నెల ఆదివారం మరియు గురువారం సుమారు 100 మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి సీఈవో వర్ష ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్ పరీక్షలు, అవసరమైన మందులు పూర్తిగా ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి. డబ్బు లేక చికిత్స ఆలస్యం కాకూడదు. అందుకే ప్రతి నెల రెండు రోజులు ఈ సేవను కొనసాగిస్తున్నామని వర్ష ప్రశాంతి అన్నారు. ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని మంది పేదలకు సమాచారం చేరేలా సహకరించాలని ఆమె కోరారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యుల బృందం ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా పాల్గొంటున్నారు. వినాయక ఆసుపత్రి తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్థానికులు హర్షిస్తున్నారు.

# మత్తుకు బానిసైతే భవిష్యత్తు నాశనం

- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. లక్ష్యాలను చేరుకునే దిశగా అడుగులు వేయాలి
- యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలి



**ఉప్పల్, జులై 29 ( జనం సాక్షి ):** మత్తు పదార్థాల ప్రభావానికి లోనై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఉప్పల్ ఏసీపీ వెంకటరెడ్డి సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు మత్తు పదార్థాల ముఠాలు ప్రలోభాలకు గురిచేస్తున్నాయని, తొలుత సరదాగా మొదలైన అలవాటు క్రమంగా వ్యసనంగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం, సామాజిక సంబంధాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా తమ దృష్టిని చదువు, క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక కార్యక్రమాలపై కేంద్రీకరించాలని సూచించారు.యువత జీవితంలో కీలకమైన విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాంతం బాధపడే పరిస్థితి తెచ్చుకోవద్దని విద్యార్థులకు సూచించారు.ఎస్‌హెచ్ఓ వై. రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ పరిధిలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు సంబంధించిన కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థులు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద ఆఫర్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

### డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని పోలీసులు పేర్కొన్నారు.విద్యార్థులు తమ స్నేహితుల్లో ఎవరైనా మత్తు పదార్థాల బారిన పడుతున్నట్లు గుర్తిస్తే వారిని దూరం చేయకుండా సరైన మార్గంలోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో పోలీసుల సహాయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు,వాటి నియంత్రణకు తీసు కుంటున్న చర్యలపై వివరించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురువును గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయం



**నవాబుపేట్ జూలై 29 ( జనం సాక్షి)** నవాబుపేట్ మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామ శివారి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా సాయి బాబా ఆలయం లో ట్రస్ట్ చైర్మన్ రావు గారి వెంకట్ రెడ్డి ప్రత్యేక పూజలుగురుపౌర్ణమి సందర్భంగా నవాబుపేట్ మండల పిఏసిఎస్ చైర్మన్ పోలీస్ రామ్ రెడ్డి సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిట్టేపు మల్లారెడ్డి హాజరై సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టేపు మల్లారెడ్డి, మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. మన జీవితానికి సరైన మార్గాన్ని చూపించి, జ్ఞానాన్ని అందించే గురువులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలని సూచించారు. గురువుల ఆశీస్సులు, మార్గదర్శకత్వం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సద్గురువులను స్మరించుకోవడంతో పాటు, సత్యం, ధర్మం, సేవా మార్గంలో నడవాలని ఆయన ఆకాంక్షించారు.సాయిబాబా బోధించిన ప్రేమ, శాంతి, సేవా భావాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రావు గారి వెంకట్ రెడ్డి అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వంమానవతా విలువలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు.భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలుఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులుతలారి ప్రభాకర్, నాగిరెడ్డి, స్వర్ణమారెడ్డి, రఫీ, ప్రకాష్, రామచంద్ర రెడ్డి,తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబా ఆలయం అర్చకులు పూజ కార్యక్రమాలు నిర్వహించి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# "రెవెన్యూ" నిర్లక్ష్యం అందని కుల ఆదాయ సర్టిఫికెట్లు

- నెల రోజులుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- ఇబ్రహీంపట్నం మండలంలో కదలని ఫైల్స్
- ఇష్టారాజ్యంగా విధులకు హాజరు

**రంగారెడ్డి,జూలై 29 (జనంసాక్షి)** ఇబ్రహీంపట్నం మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్‌లు), ఉద్యోగ దరఖాస్తులకు అత్యంత కీలకమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమయానికి అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు చేసుకుని నెల రోజులు గడుస్తున్నా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల ఇష్టారాజ్యం కారణంగా విద్యార్థులు, ప్రజలు పదరాని



పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సర ప్రారంభం కావడంతో విద్యార్థులకు వివిధ కోర్సుల్లో చేరేందుకు, స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అత్యవసరంగా మారాయి. అదే సమయంలో వివిధ సంక్షేమ పథకాలకూ కుల, ఆదాయ పత్రాలు అవసరవుతున్నాయి. అయితే ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోజూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారుల నుంచి స్పష్టత కరవైంది. "సర్వర్ పని చేస్తలేదు", "మేడం అందుబాటులో లేరు", "విచారణ పూర్తి కాలేదు", "అధికారులందరూ ఎస్ఐఆర్ ప్రోగ్రాంలో ఉన్నారు" అంటూ సిబ్బంది రోజుకో సాకుతో కాలయాపన చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.ప్రజాసమస్య ను పరిష్కరించాల్సిన ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రంలోని అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రయాణ ఖర్చులు భరించలేక, పనులను వదులుకోలేక నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ఇబ్రహీంపట్నం మండలంలో



పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయ సర్టిఫికెట్ల దరఖాస్తులను తక్షణమే క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఆకస్మిక తనిఖీలు లేకపోవడంతో విధుల పట్ల నిర్లక్ష ధోరణి అవలంబిస్తున్నారు. బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కేవలం ధ్రువీకరణ పత్రాల జాప్యానికే పరిమితం కాలేదు. సమయపాలనలోనూ అదే తీరు కొనసాగుతోంది. ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 9.30 లేదా 10 గంటలకే తెరుచుకోవాల్సి ఉండగా, మండల తహశీల్దార్ మాత్రం ఉదయం 11:30 దాటినా కార్యాలయానికి రాకపోవడం గమనార్హం.దూర ప్రాంతాలనుంచి వివిధ పనుల నిమిత్తం ఉదయం పూట,ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి కార్యాలయానికి వస్తున్న ప్రజలు, రైతులు, విద్యార్థులు తహసిల్దార్ రాకకోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. సమయపాలన పాటించాల్సిన అధికారే నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుండటంతో కిందిస్థాయి సిబ్బంది కూడా ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి అధికారులపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కేవలం ధ్రువీకరణ పత్రాల జాప్యానికే పరిమితం కాలేదు.నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రయాణ ఖర్చులు భరించలేక, పనులను వదులుకోలేక నానా అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు భార్యాభర్తలం ఇద్దరికీ కులం సర్టిఫికెట్ కోసం ఈ నెల 3న మీ సేవలో దరఖాస్తు చేసిన. గత 15 రోజులుగా కార్యాలయం చుటూ తిరుగుతున్న ఎం చెప్పడం లేదు.కుల ధృవీకరణ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసి రెండు నెలలు కావస్తుంది. మీ సేవలో అప్లయ్ చేసి నేరుగా ఫామ్స్ రెవెన్యూ ఆఫీసులో ఇచ్చినం. పేపర్లు కనిపిస్తలేవంటే మూడు సార్లు జిరాక్స్ లు ఇచ్చినా అయినా సర్టిఫికెట్లు రావడం లేదు. ఏదో పేరుతో పొంతన లేని సమాధానం ఇస్తున్నారు.

# గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే



**ఎల్బీనగర్ జులై 28 (జనం సాక్షి)** గురు పౌర్ణమి సంద ర్భంగా ఎల్‌బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో ఉండాలని ప్రార్థించిన ఆయన గురువుల మార్గదర్శకత్వం సమాజ అభ్యున్నతికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవాలయం ట్రస్ట్ బోర్డు సభ్యుడు మల్లయ్య, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, గండి సన్నీ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, తిలక్ రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల సంఘం మండల కమిటీ ఎన్నిక



**కేశంపేట జూలై 29 (జనం సాక్షి ):** మండల కేంద్రంలో మండల వార్డు సభ్యుల సంఘం నూతన కమిటీని సంఘం జిల్లా ఇన్చార్జ్ గ్యార సురేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ మండల అధ్యక్షులుగా సంగెం గ్రామానికి చెందిన కుమ్మరి సాయిరాం, గౌరవ అధ్యక్షులుగా గంజాయి దశరథం , గోపని బాలమణి భీమయ్య, ఉపాధ్యక్షులుగా జింకల యాదగిరి, అబ్బి శ్రీను, బొట్టు శ్రీను, కుమ్మరి అరవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆవుల యాదగిరి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ గ్యార సురేష్ మాట్లాడుతూ.. వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్ల సాధన కోసం నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తరు?

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తు వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యే వైఖరి మోసపూరితమని మండిపాటు

**రంగారెడ్డి, జులై 29 (జనంసాక్షి) :** అబద్దాలు , ఉత్తుత్తి సమావేశాలతో ఫార్మాసిటీ రైతులను ఇంకెంతకాలం మోసం చేస్తారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు ఫార్మాసిటీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబుతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఫార్మా రైతుల సమావేశానికి సంబంధిత రైతులను , ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులను పిలవకుండా మరోసారి మోసం చేశారని చెప్పారు. తూతూమంత్రపు సమావేశాలతో రైతులకు ఒరిగిందేమీ లేదని , హామీల అమలుకు నిర్దుష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు తిరిగి భూములు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యేకు సూచించారు. రైతుల అంగీకారం లేకుండా ఆన్ లైన్ లో వారి పేర్లు తొలగించిన 2500 ఎకరాల భూములను వెంటనే రైతుల పేరిట నమోదు చేయాలని కోరారు. మేడిపల్లి , నానక్ నగర్ , తాడిపర్తి , కుర్మిద్ద గ్రామాలకు కిలోమీటరు దూరం వరకు ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. భూములు రైతులకు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తే రైతులు



తిరగబడతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఫార్మా రైతులకు ఇప్పించిన ప్లాట్లను ప్రస్తుత ప్రభుత్వం మూడేండ్లు కావస్తున్నా రైతులకు రిజిస్ట్రేషన్ చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతులు విసిగిపోయి ఆ ప్లాట్లను అడ్డికిపావుశేరుకు అమ్ముకునేలా పెద్ద నాయకుల కనుసన్నల్లో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కందుకూరు మండలంలోని ముచ్చర్ల , మీరఖాన్ పేట , సార్లరావుల పల్లి , బేగరికంచ , అన్నోజిగూడ , పంజాగూడ రైతులకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పట్టుబట్టి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించారని చెప్పారు. ఇక్కడి రైతులకు బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయించలేకపోవడం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అసమర్థతకు నిదర్శనమని దుయ్యబట్టారు. ఇందిరమ్మ పేదలకు భూములిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుంటుందని అప్పుడు గగ్గోలు పెట్టిన నేతలు ఇప్పుడు మొండిగౌరెల్లి , కొత్తపల్లి , కుర్మిద్ద , మర్లకుంట తండా , ముచ్చర్ల గ్రామాల్లో పేద రైతుల నుండి ఎందుకు భూములు లాక్కుంటున్నారని ఆయన ప్రశ్నించారు.

# ధారూర్ గ్రామంలో సమస్యల వెల్లువ

## గ్రామ సభలో సమస్యలను లేవనెత్తిన మాజీ ఉపసర్పంచ్ యూనుస్ ఇబ్రహీం

**ధారూర్ జూలై 29(జనంసాక్షి) :** ధారూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ ప్రమీల చిన్నయ్య గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామ సమస్యలు ప్రధాన చర్చగా మారాయి.మండల పంచాయతీ అధికారి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ యూనుస్ ఇబ్రహీం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణ పరిష్కారం కోరారు.బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని,లేదంటే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ సంతలో తాగునీరు, విద్యుత్,పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించి, సంతను బండబాయి ప్రాంతంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అన్నారు.దస్తగిరి పీర్ల సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా విలువైన తాగునీరు వృథాగా పోతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని విమర్శించారు.వెంటనే లీకేజీని గుర్తించి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని అయన డిమాండ్ చేశారు.గ్రామంలో ఇప్పటికీ నిజాం కాలం నాటి 11 ఇనుప విద్యుత్ స్తంభాలు ఉండటం ఆందోళనకరమని, వర్షాకాలంలో వాటి వల్ల విద్యుత్ షాక్ ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు.ప్రజల భద్రత దృష్ట్యా వాటి స్థానంలో సిమెంట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.అదేవిధంగా గ్రామంలోని మురికి కాలువలను వెంటనే శుభ్రపరచి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని, ప్రజల ఆరోగ్యంతో




నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు.ధారూర్‌లో రోడ్డు విస్తరణ కోసం మాస్టర్ ప్లాన్ అమలు చేసే సమయంలో షాపులు కోల్పోయే బాధితులకు యజమానులకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్రామసభలో ప్రస్తావించిన అన్ని సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ ప్రమీల చిన్నయ్య గౌడ్ హామీ ఇచ్చారు.సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగిర్,గ్రామ పంచాయతి కార్యదర్శి అంజా నాయక్,డిసిసి కార్యదర్శి భాబా ఖాన్,ధారూర్ టౌన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దావుద్,సీనియర్ నాయకులు బి,అంజయ్యా,వార్డు సభ్యులు బిఎల్ఓ లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సర్ నమోదు చేసుకోవాలి : బిఆర్ఎస్ నాయకులు గోరటి వెంకటేశం

**యాచారం, జులై 29(జనంసాక్షి) :** భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకుని, ఓటు హక్కును భద్రపరుచుకోవాలని బిఆర్ఎస్ నాయకులు గోరటి వెంకటేశం పిలుపునిచ్చారు. బుధవారం నంది వనపర్తి గ్రామంలో ఆయన తన సర్ నమోదును పూర్తి చేసుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను అత్యంత ఖచ్చితంగా రూపొందించడమే ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ముఖ్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా అర్హులైన ఏ ఒక్క పౌరుడు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడటంతో పాటు, మరణించిన వారి, శాశ్వతంగా వలస వెళ్లిన వారి, నకిలీ మరియు పౌరులు కాని



వారి పేర్లను జాబితా నుండి తొలగిస్తారని వివరించారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. నంది వనపర్తి గ్రామంలో ఇప్పటివరకు దాదాపు 80 శాతం మంది ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తయిందని స్థానిక బూత్ లెవెల్ అధికారులు తెలిపినట్లు వెంకటేశం పేర్కొన్నారు. ఇంకా నమోదు చేసుకోని మిగిలిన 20 శాతం మంది ప్రజలు అలసత్వం వహించకుండా, వెంటనే అప్రమత్తం కావాలని కోరారు. రాబోయే ఆగస్టు 3వ తేదీ లోపు తమకు కేటాయించిన ఓటర్ ఫారాలను పూర్తిగా పూరించి, స్థానిక బిఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల నమోదు మరియు సవరణలకు సంబంధించి ఎలాంటి సందేహాలు లేదా సమాచారం కావాలన్నా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందుబాటులో ఉండే బిఎల్ఓలను సంప్రదించి, గడువులోగా అందరూ తప్పనిసరిగా సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని గోరటి వెంకటేశం కోరారు.



## గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబా ఆశీస్సులు పొందిన తోట మహేష్ యాదవ్

**ఎల్బీనగర్ జులై 28 (జనం సాక్షి) :** గురుపూర్ణిమ సందర్భంగా ఫణిగిరి కాలనీలోని శ్రీ సాయిబాబా దేవాలయంలో తోట మహేష్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో తోట మహేష్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం యాదవ్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నర్సింహారెడ్డి, రాజేష్, బాలు, గణేశ్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు. సాయిబాబా అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు.?

## ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలను జరుపుకోవాలి : లాలగూడ ఇన్‌స్పెక్టర్ బి. రవికిరణ్



**సికింద్రాబాద్(జనంసాక్షి) :** బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో సురక్షితంగా నిర్వహించుకోవాలని లాలగూడ ఇన్‌స్పెక్టర్ బి. రవికిరణ్ సూచించారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని చెప్పారు. ఈ మేరకు లాలగూడ పోలీసులు బుధవారం రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బోనాల పండుగ సమయంలో మంచి ప్రవర్తనతో ఉండాలని, ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడరాదని సూచించారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, సంఘ విద్రోహ కార్యకలాపాలు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు లాలగూడ పోలీసులు కట్టుబడి ఉన్నారని, శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## దత్తాత్రేయ దయతో సర్వం సుభిక్షంగా ఉండాలి

### గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాగణంలో అన్నదానం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్



**తాండూరు జులై 29(జనంసాక్షి) :** దత్తాత్రేయుని కరుణా కటాక్షాలతో సర్వంసుభిక్షంగా ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ పేర్కొన్నారు.బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా ఘాన్ గాపూర్ లోని త్రివేణి సంగమంలో నది స్నానం ఆచరించి శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రో చ్ఛారణల తో ఆశీర్వదించి మరేన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని మనసారా ఆశీర్వదించి తీర్ధ ప్రసాదా లను అందజేస్తూ ఘనంగా సన్మానించారు.గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు వర్త్య విఠల్ నాయక్ అన్నసమర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ పౌర్ణమిరోజు చేసిన పూజలు, దానధర్మాలు, జన్మజన్మల పాపాలు తొలగిపోతాయన్నారు. అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి నెల పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకో వడం జరుగుతుందని వెల్లడించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ పూజారులు రాజు , భక్తులు, తదితరులు ఉన్నారు.

# వర్షంలో వరద.. ఎండలో దుమ్ము.. ఉప్పల్‌లో నరకయాత్ర



**ఉప్పల్, జులై 29 (జనం సాక్షి):** హైదరాబాద్ నగరానికి తూర్పు ముఖద్వారంగా ఉన్న ఉప్పల్.. ప్రతిరోజూ లక్షలాది మంది రాకపోకలు సాగించే కీలక ప్రాంతం. అయితే అభివృద్ధికి చిరునామాగా ఎదుగుతున్న ఈ ప్రాంతంలో ప్రజలకు మాత్రం కష్టాలు తప్పడం లేదు.వర్షం వస్తే రోడ్లపై వరద.. ఎండ కొడితే దుమ్ము.. ట్రాఫిక్ పెరిగితే గంటల తరబడి నిరీక్షణ.. ఫ్లైఓవర్ పనులు పూర్తికాకపోతే అంతులేని ఎదురుచూపులు..ఇదే ఉప్పల్--నారపల్లి ప్రధాన మార్గంలో ప్రతిరోజూ ప్రయాణించే ప్రజల పరిస్థితి.ఏళ్లుగా కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు.. రహదారులపై నిలిచిపోయే వర్షపు నీరు.. ఎండలో ఎగిసిపడే దుమ్ము.. రద్దీ సమయాల్లో కిలోమీటర్ల మేర నిలిచిపోయే ట్రాఫిక్.. ఇవన్నీ కలిసి ఉప్పల్ ప్రజలకు నిత్య నరకయాత్రగా మారాయి.ఫ్లైఓవర్ పూర్తయ్యే వరకు ఉప్పల్ ప్రజలు ఈ నరకయాత్రను భరించా ల్సిందేనా..?అంటూ స్థానికులు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.వర్షం వస్తే రోడ్లపైనే వరద..ఉప్పల్--నారపల్లి ప్రధాన రహదారిపై భారీ వర్షం కురిసిందంటే చాలు.. రహదారిపై నీరు నిలిచిపోవడం పరిపాటిగా మారింది.వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు అవసరమైన పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడంతో కొద్దిసేపు భారీ వర్షం కురిసినా రోడ్లు నీటితో నిండిపోతున్నాయని ప్రజలు అంటు న్నారు.వాహనాలు నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. రోడ్డు ఎక్కడుందో.. గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితుల్లో వాహనాలు నడపాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల వేగం పూర్తిగా తగ్గిపోతోంది. దీంతో ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతోంది.ఇటీవల కురిసిన వర్షాలకు కూడా రహదారిపై భారీగా నీరు నిలవడంతో అధికారులు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని ఎత్తిపోసే పరిస్థితి ఏర్పడింది."ప్రతి వర్షానికి మోటార్లు పెట్టి నీరు ఎత్తిపోవడం ఎంతకాలం..? శాశ్వత పరిష్కారం ఎప్పుడు చూపి స్తారు..?"అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నార .ఎండ కొడితే కళ్లల్లో దుమ్ము..వర్షాకాలంలో వరద నీటితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు.. ఎండాకాలంలో మరో సమస్య ఎదుం వుతోంది.నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రహదారులపై పేరుకుపోయిన మట్టి, ఇసుక, దుమ్ము వాహనాల రాకపోకలతో పైకి లేస్తోంది.వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము పెద్ద ఎత్తున గాల్లోకి ఎగసిపడుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు.వర్షం వస్తే బురద.. ఎండ కొడితే దుమ్ము.. ఏ కాలంలోనైనా ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అయినా దుమ్ము నియంత్రణకు క్రమం తప్పకుండా నీటిని చల్లాలని, రహదారులను శుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.ట్రాఫిక్ అంటేనే ఉప్పల్ ప్రజలకు భయం.ఉదయం ఉద్యోగాలకు వెళ్లే సమయం.. విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లే సమయం.. సాయంత్రం కార్యాలయాల నుంచి ప్రజలు ఇళ్లకు తిరిగి వచ్చే సమయం.ఈ సమయంలో ఉప్పల్--నారపల్లి మార్గంలో వాహనాల రద్దీ విపరీతంగా పెరుగు తోంది.ఫలితంగా వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పూర్తిగా నిలిచిపోతున్నాయి.కొద్ది కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి గంటల సమయం పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."ఉప్పల్ దాటితే చాలు.. ప్రయాణం సులభమవుతుంది" అనే పరిస్థితి ఎప్పుడు వస్తుందో అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.ప్రజల సమయం.. ఇంధనం.. అన్నీ వృథానే!ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు కేవలం సమయాన్ని మాత్రమే కాదు.. తమ డబ్బును కూడా కోల్పోతున్నారు.వాహనాలు గంటల తరబడి ట్రాఫిక్‌లో నిలిచిపోవడంతో ఇంధనం వృథా అవుతోంది.రోజూ ఇదే మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారులు తమ విలువైన సమయాన్ని రహదారిపైనే గడపాల్సి వస్తోంది.ట్రాఫిక్ సమస్య అనేది కేవలం వాహనాల రద్దీ కాదు.. ప్రజల సమయం, డబ్బు, మానసిక ప్రశాంతతపై ప్రభావం చూపుతున్న సమస్యగా మారింది.అత్యవసర వాహనాలకూ తప్పని ఇబ్బందులు.ఉప్పల్--నారపల్లి మార్గంలో ట్రాఫిక్ తీవ్రత కారణంగా అత్యవసర వాహనాల రాకపోకలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంటే ఒక్కో నిమిషం ఎంతో విలువైనదిగా మారుతుంది.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు అయినా అత్యవసర వాహనాలకు మార్గం సుగమం చేసేలా ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఏళ్లు గడిచాయి.. గడువులు మారాయి.. ఫ్లైఓవర్ మాత్రం పూర్తికాలేదు.ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు గణనీయంగా ఉపశమనం లభిస్తుందని ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఆశిస్తున్నారు.అందుకే పనులు ప్రారంభమైనప్పటి నుంచి ఓపికగా ఎదురుచూస్తున్నారు.ఏళ్లు గడిచాయి.. ప్రభుత్వాలు మారాయి.. పాలకులు మారారు.. అధికారులు మారారు.. పనుల గడువులు మారాయి.కానీ ప్రజల ఎదురుచూపులకు మాత్రం ఇంకా ముగింపు రాలేదు.ఫ్లైఓవర్ పనులు పూర్తికాకపోవడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి కొనసాగుతోంది.దసరా నాటికి పూర్తవుతుందా..ఉప్పల్--నారపల్లి ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి దసరా నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ఉప్పల్ ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి ఏళ్లుగా ఫ్లైఓవర్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఇప్పుడు ఆ హామీ నిజమవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ప్రతీ పనిలో కమీషన్లే లక్ష్యంగా పనిచేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ప్రతి పనిలో కమీషన్లే లక్ష్యంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే పనిచేస్తున్నాడని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఆరోపించారు. అల్వాల్ పరిధిలోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రి నిర్మాణ పనులను బుధవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కంటోన్మెంట్, మల్కాజిగిరి ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 1,000 పడకల టిమ్స్ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంబంధిత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పనులు 90 శాతం పూర్తయ్యాయని ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ ఆస్పత్రిని ప్రారంభించకపోవడం దురదృష్టకరమన్నారు. కంటోన్మెంట్ వన్ టైమ్ ఎమ్మెల్యేకు ప్రతీ దాంట్లో కమీషన్లే కావాలని ఎద్దేవా చేశారు. తిరుమలగిరి చెరువు పనులు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కూడా అవినీతి జరిగిందని ఆరోపించారు. అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి పనులు ఎందుకు పూర్తికాలేదో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నాయకుల ఆస్పత్రి సందర్శనకు పోలీసులు అభ్యంతరం చెప్పడం ఏంటని మండిపడ్డారు. ప్రజల కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని ఎవరైనా సందర్శించవచ్చని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల వరకు ఆస్పత్రి ప్రారంభాన్ని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# జనంసాక్షి కథనానికి స్పందించిన ప్రజాప్రతినిధులు

- పాడైపోయిన బోర్ స్టార్టర్‌కు మరమ్మతులు
- ఎస్సీ కాలనీలో పునరుద్ధరించిన తాగునీటి సరఫరా

**కోట్‌పల్లి, జులై 29 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి బోర్‌వెల్ స్టార్టర్ ధ్వంసమై నెల రోజులుగా మరమ్మతులకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనంసాక్షిలో ప్రచురితమైన కథనానికి ప్రజాప్రతినిధులు స్పందించారు.వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ధ్వంసమైన బోర్ స్టార్టర్‌కు మరమ్మతులు చేపట్టించారు. దీంతో తిరిగి బోర్‌వెల్ ద్వారా తాగునీటి సరఫరా ప్రారంభమై కాలనీవాసులకు ఊరట లభించింది.ఈ సందర్భంగా కాలనీవాసులు స్పందిస్తూ, తమ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన జనంసాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సమస్యపై వెంటనే స్పందించిబోర్ స్టార్టర్‌ను మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరిం చిన ప్రజాప్రతిని ధులకు ధన్యవాదాలు తెలిపారు.


పాడైపోయిన బోర్ స్టార్టర్‌ను పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కోట్‌పల్లి, జులై 28 (జనంసాక్షి): కోట్‌పల్లి మండలంలోని ఎస్సీ కాలనీలో ఉన్న తాగునీటి బోర్‌వెల్ స్టార్టర్‌ను గత నెలలో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినప్పటికీ, ఇప్పటివరకు దానిని మరమ్మతు చేయించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బోర్ స్టార్టర్ ధ్వంసమైన విషయాన్ని ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల మౌలిక అవసరమైన తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఎస్సీ కాలనీలోని ధ్వంసమైన బోర్ స్టార్టర్‌ను తక్షణమే మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీ వాసులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

జనంసాక్షి
29 Jul 2026 - Page 6
https://epaper.janamsakshi.org/clip/522

## గురువు చూపిన జ్ఞానబాటలోనే సమాజ ప్రగతి



**సికింద్రాబాద్(జనంసాక్షి):** గురువు వెలిగించిన జ్ఞాన దీపమే వ్యక్తిని, సమాజాన్ని, దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని బీజేపీ నాయకులు డా. శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. పవిత్ర గురుపౌర్ణిమ సందర్భంగా దేశంలోని ఆధ్యాత్మిక గురువులు, ఉపాధ్యాయులు, వేదపండితులు, తల్లిదండ్రులు,సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్న ప్రతి గురువుకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హనుమాన్ నగర్‌లోని శ్రీ శివాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురుపౌర్ణిమ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం చైర్మన్ శ్రీ రాజు,చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు బీజేపీ నాయకులు ఎస్.వెంకటేష్ గౌడ్, డా.శ్రీరామ్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో గురువుకు భగవంతునితో సమానమైన స్థానం కల్పించారని పేర్కొన్నారు. గురు పౌర్ణిమ కేవలం పండుగ మాత్రమే కాదని.. కృతజ్ఞతకు ప్రతీక, సంస్కృతికి చిహ్నం, జ్ఞానానికి మహోత్సవమని డా. శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. గురువులు అందించిన విజ్ఞానం, క్రమశిక్షణ,నైతిక విలువలు, దేశభక్తి,సేవాభావం జీవితాన్ని సార్థకం చేస్తాయని తెలిపారు. ప్రతి యువకుడు గురుపౌర్ణిమ సందర్భంగా తన గురువులను స్మరించుకోవాలని, వారి ఆశయాలను ఆచరణలో పెట్టాలని, సమాజ సేవను జీవిత లక్ష్యంగా మలుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.దిన కుమ్మరి సాయిరాం, గౌరవ అధ్యక్షులుగా గంజాయి దశరథం , గోపని బాలమణి భీమయ్య, ఉపాధ్యక్షులుగా జింకల యాదగిరి, అబ్బి శ్రీను, బొట్టు శ్రీను, కుమ్మరి అరవింద్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆవుల యాదగిరి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ గ్యార సురేష్ మాట్లాడుతూ.. వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎలిమినేడు పాఠశాలకు కథల పుస్తకాల పంపిణీ



**ఇబ్రహీంపట్నం, జులై 29(జనం సాక్షి )**ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు తోటిరెడ్డి జయశ్రీ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుకై గొప్ప వితరణ చేశారు. స్థానిక పాఠశాల పిల్లల విజ్ఞానం, నైతిక విలువల పెంపొందించడం కొరకు ఆమె గ్రంథాలయ పుస్తకాలను బహుకరించారు.విద్యార్థుల్లో రీడింగ్ హాబిట్స్ పెంచేందుకు కథల పుస్తకాలు, సమాజం పట్ల అవగాహన పెంచే నైతిక విలువల విజ్ఞాన గ్రంథాలు, మరియు వారి భవిష్యత్తుకు బాటలు వేసే వ్యక్తిత్వ వికాస పుస్తకాలను ఆమె పాఠశాల గ్రంథాలయానికి అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు తోటిరెడ్డి జయశ్రీ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. విశ్రాంత వయసులోనూ పిల్లల చదువుపై, వారి సంస్కారంపై ఆమె చూపిన చొరవ అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు.ఈ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలశౌరి, రాజేందర్, శ్రీలత, బాలమణి, వరలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వల్లారపు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



**సికింద్రాబాద్ (జనం సాక్షి):**టీడీపీ సికింద్రా బాద్ నియో జకవర్గం ఇంఛార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ జన్మదిన వేడుకలను బుధ వారం వారసిగూడ లోని ఆయన నివాస ంలో ఘనంగా నిర్వ హించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## గురుపౌర్ణమి ప్రధానోపాధ్యాయులకు శాపమైందా...?

### గుడ్ల ధర భారం గురువులపై వేయొద్దు : బిజేపి కౌన్సిలర్ నాగారం మల్లేశం



**తాండూరు జులై 29(జనంసాక్షి) :** గురువులను పూజించే గురుపౌర్ణమి రోజే తెలంగాణలోని ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారిందని బీజేపీ కౌన్సిలర్ నాగారం మల్లేషం ఆరోపించారు. విద్యాసంస్థలకు సంబంధించిన తాజా సర్క్యులర్ మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టడం లేదని, దీంతో మధ్యాహ్న భోజన పథకం అమలు భారం మొత్తం ప్రధానోపాధ్యాయుల భుజాలపై పడుతోందని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక గుడ్డు ధర 8.50 రూపాయలు ఉండగా, ప్రభుత్వం మాత్రం 6 రూపాయలకే సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. మిగిలిన 2.50 రూపాయల తేడాను ప్రధానోపాధ్యాయులే తమ జేబులో నుంచి భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్క్యులర్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు. మెనూలో గుడ్డు తగ్గించినా, ధర పెరిగినా దాని భారం ఉపాధ్యాయులపై వేయడం అన్యాయం అని అన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని రెండు డిమాండ్లు చేశారు. వెంటనే ప్రభుత్వమే గుడ్లను కొనుగోలు చేసి పాఠశాలలకు సరఫరా చేయాలి. అది సాధ్యం కాకపోతే, మార్కెట్ ధర 8.50 రూపాయల చొప్పున ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలి. గురుపౌర్ణమి రోజు గురువులను గౌరవించాల్సింది పోయి, ఆర్థిక భారంతో వారిని ఇబ్బంది పెట్టడం సరికాదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని, లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత, ధరల మధ్య సమతుల్యత లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకుల పరామర్శ



**మర్పల్లి జులై 29 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం మొగిలి గుండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివన్న మాతృమూర్తి తిరుపతమ్మ (75) మంగళవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి మృతి చెందింది. ఇట్టి విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మొగిలిగుండ్ల గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంటు లలితా రమేష్, మాజీ జడ్పిటిసి మధుకర్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మండల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాయక్ గౌడ్, పట్లూర్ గ్రామం మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మధుకర్, నీలి శ్రీకాంత్, తలారి రమేష్, హరి సింగ్, అనంతయ్య, గ్రామ సర్పంచ్ రాజన్నపాల్గొన్నారు.

## సాయినాథునికి భక్తి శ్రద్ధలతో పుష్పార్చన



**తాండూరు,జులై 29 (జనంసాక్షి)**స్థానిక శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఘనమైన పుష్పార్చన మహోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నీరజ బాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయిబాబా వారికి వివిధ రకాల సుగంధ పుష్పాలతో భక్తిశ్రద్ధలతో అర్చన చేశారు. అనంతరం వేద పండితులు చైర్‌పర్సన్ కి ఆశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సాయినాథుని దివ్య ఆశీస్సులు మన తాండూర్ పట్టణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులయ్యారు.

## అరుణాచలం ఆధ్యాత్మిక యాత్రకు భక్తుల నుంచి విశేష స్పందన

### డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్







**తాండూరు జులై 29 (జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాండూర్ డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరుణాచలం ఆధ్యాత్మిక యాత్రకు భక్తుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.డీలక్స్ బస్సులో చేపట్టనున్న మూడు రోజుల యాత్ర ఆగస్టు 3 నుంచి 5 వరకు జరగనుంది.ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ యాత్రలో భాగంగా భక్తులు మూడు ప్రధాన పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, వెల్లూరు శ్రీ లక్ష్మీ నారాయణ గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలైలోని శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అరుణాచల గిరి ప్రదక్షిణ కూడా చేయించనున్నట్లు తెలిపారు.యాత్ర షెడ్యూల్ ప్రకారం 03-08-2026 సోమవారం రాత్రి 9.00 గంటలకు తాండూర్ నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. 05-08-2026 బుధవారం సాయంత్రం 5.00 గంటలకు అరుణాచలం నుంచి తిరుగు ప్రయాణం ప్రారంభమై గురువారం ఉదయానికి తిరిగి తాండూర్ చేరుకుంటుంది.ప్యాకేజీ వివరాలకు వస్తే, పెద్దలకు టికెట్ ధర రూ3,600 గా నిర్ణయించారు. హాఫ్ టికెట్ రూ.2,000. అయితే దేవాలయాల్లో దర్శనం, భోజనం మరియు వసతి ఖర్చులను భక్తులే స్వయంగా భరించాల్సి ఉంటుందని తెలిపారు.ఈ యాత్రకు సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి ఉన్న భక్తులు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు. బుకింగ్ కోసం సంప్రదించాల్సిన నంబర్లు హుస్సేన్, ఎడిసి 9948947422,నవీన్ గౌడ్, సత్యం సూపర్ వైజర్ 8309348157 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## సూరారం సాయిబాబా నగర్ ఫేస్-1 బాధితులకు కలెక్టర్ తో మాట్లాడి న్యాయం చేస్తా

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**నిజాంపేట్ జూలై 29 జనంసాక్షి :** సూరారం సాయిబాబా నగర్ ఫేజ్ 1 సర్వే నంబర్ 49/6 నివసిస్తున్న 120 కుటుంబాల సభ్యులు స్థానిక కుత్బుల్లాపూర్ రెవెన్యూ సిబ్బంది వారి స్థలాల దగ్గరికి వచ్చి ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఇంటి నిర్మాణాలకు చేపట్టారని రెవెన్యూ అధికారులు కూల్చివేతలు ప్రారంభించిన నేపథంలో వారు స్థానిక మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ని బుధవారం కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించారు ఈ సందర్భంగా వారు కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని అనంతరం షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్థానికులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను ఆయనకు అందజేసి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతులను స్వీకరించిన కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.





## విద్యార్థి జీవితంలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలవర్చుకోవాలి

### మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి

**తాండూరు జులై 29(జనంసాక్షి)** విద్యార్థి జీవితంలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి పేర్కొన్నారు .బుధవారం.తాండూర్ పట్టణంలోని ఖాంజాపూర్ సమీపంలో గల తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌లో నేటి నుంచి మెగా తరగతులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ నీరజ బాల్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాల్యం నుంచే మెగా అలవాటు చేసుకోవడం మంచిదని, చదువుతో పాటు ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విద్యార్థులు ప్రతిరోజూ ఆటలు ఆడటంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. విద్యార్థి జీవితంలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఒక భాగంగా ఉండాలని, అప్పుడే సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెగా గురూజీ ప్రవీణ్ ,పాఠశాల ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.







## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

### తహసిల్దార్ సురేందర్

**శంకర్‌పల్లి, జూలై 29(జనం సాక్షి) :** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియపై తాసిల్దార్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా తాసిల్దార్ సురేందర్ మాట్లాడుతూ.. ప్రతి బూత్ స్థాయిలో బి ఎల్ వోలు మరియు బి ఎల్ఏలు కలిసి పనిచేయాలని సూచించారు. జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని కోరారు.ప్రతి పార్టీ తమ బిఎల్ఎ లను అప్రమత్తం చేసి, ఇంటింటికి వెళ్లి ఓటర్ వివరాలు సరిచూసుకోవాలని అక్రమంగా ఓట్లు తొలగింపులు జరిగినట్టు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలియజేశారు.ఎస్ఐ ఆర్ ప్రక్రియలో నిర్దేశిత గడువులోగా పూర్తి చేసుకోవాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షుడు పాటు ఇతర పార్టీల అధ్యక్షులు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీడీఆర్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ వినతి



**ఘట్కేసర్ , జూలై 29 (జనంసాక్షి ) :** టీడీఆర్ మార్కెట్ విలువల అమలు, అదనపు అంతస్తుల అనుమతులు, సెట్‌బ్యాక్ మినహాయింపులు, అలాగే బిల్డ్ నౌ పోర్టల్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జే.టి. విద్యాసాగర్, సభ్యులు మోహన్‌రావు, పి.ఏ.ఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, 2026 జూన్ 4కు ముందు భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించినప్పటికీ, ప్రస్తుతం అధికారులు సవరించిన మార్కెట్ విలువల ఆధారంగా టీడీఆర్ మొత్తాలను లెక్కించి అదనపు చెల్లింపులు (షార్ట్‌ఫాల్) విధిస్తున్నారని తెలిపారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 4కు ముందు సమర్పించిన దరఖాస్తులకు అప్పటి మార్కెట్ విలువలనే వర్తింపజేయాలని, దరఖాస్తు తేదీ ఆధారంగా టీడీఆర్ విలువలు లెక్కించేలా బిల్డ్ నౌ పోర్టల్‌లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు పొంది, అన్ని ఫీజులు చెల్లించి, జీవో ఎంఎస్ నెం.168 ప్రకారం 10 శాతం మార్టిగేజ్ ప్రక్రియ పూర్తి చేసిన బిల్డర్లు, ప్రస్తుతం జీవో ఎంఎస్ నెం.95 ప్రకారం టీడీఆర్, అదనపు అంతస్తులు, సెట్‌బ్యాక్ మినహాయింపుల కోసం సవరించిన దరఖాస్తులు సమర్పించేందుకు ప్రయత్నిస్తుండగా, బిల్డ్ నౌ పోర్టల్ వాటిని అంగీకరించకపోవడంతో అనేక నిర్మాణ పనులు నిలిచిపోయాయని వివరించారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, జీవో ఎంఎస్ నెం.95 అమలుపై ఉన్న సందిగ్ధతను తొలగించాలని, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏకరీతి విధానం అమలు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలోని అంశాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సానుకూలంగా స్వీకరించారని, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన నిర్ణయం తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

# అన్ని రాజకీయ పార్టీలు, బిఎల్ఎలు సహకారంతో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## చేవెళ్ల ఆర్డీవో కె.పార్థసింహా రెడ్డి



**చేవెళ్ల, జూలై 29 (జనంసాక్షి)** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని చేవెళ్ల ఆర్డీవో కె.పార్థసింహా రెడ్డి చేవెళ్ల నియోజక వర్గం రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జూలై 29 మధ్యాహ్నం 12 గంటల వరకు చేవెళ్ల నియోజక వర్గం ఏఈఆర్ఓల నివేదిక ప్రకారం చేవెళ్ల నియోజకవర్గంలో మొత్తం 2,73,883 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,13,606 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ చేయబడ్డాయని. దీంతో 77.99 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు ఆర్డీవో వెల్లడించారు. ఇంకా 21,052 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉందన్నారు. చేవెళ్ల నియోజక వర్గం మండలాల వారీగా నవాబుపేటలో 81.06 శాతం, శంకర్‌పల్లిలో 81.18 శాతం, శంకర్‌పల్లి మున్సిపాలిటీలో 71.55 శాతం, మొయినాబాద్‌లో 79.63 శాతం, మొయినాబాద్ మున్సిపాలిటీలో 72.89 శాతం, షాబాద్‌లో 77.97 శాతం, చేవెళ్ల మండలంలో 81.40 శాతం, చేవెళ్ల మున్సిపాలిటీలో 73.36 శాతం డిజిటలైజేషన్ పూర్తయినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ మొత్తం 92.31 శాతం పూర్తయిందని, మిగిలిన డిజిటలైజేషన్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల వివరాల మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి సహకారం అందించాలని ఆర్డీఓ కె. పార్థసింహా రెడ్డి విజ్ఞప్తి చేశారు. అందరి సమన్వయంతో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆర్డీవో పార్థసింహా రెడ్డి తెలిపారు.

# సాయినామ స్మరణతో మార్మోగిన మర్పల్లి షిరిడి సాయిబాబా ఆలయం

## ప్రత్యేక పూజలు, అభిషేకాలు అన్నదాన కార్యక్రమం సాయిబాబా సన్నిధిలో భక్తుల ఆధ్యాత్మిక సందడి



**మర్పల్లి జూలై 29 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం లో బుధవారం గురుపౌర్ణిమ పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించగా, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురుపౌర్ణిమ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య సాయిబాబాకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సాయిబాబాకు మహా మంగళహారతి సమర్పించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంలో ప్రార్థనలు చేశారు. ఆలియా ప్రాంగణంలో మహిళా భక్తులు కోలాటలాడుతూ నృత్యం చేస్తూ సాయిబాబాను స్మరించుకున్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తుల కోసం శ్రీ సాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు క్రమపద్ధతిలో అన్నప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా ఆశీస్సులు పొందారు. గురుపౌర్ణిమ సందర్భంగా భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం రోజు పొడవునా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సేవా సమితి సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గురుపూజా మహోత్సవాన్ని విజయవంతం చేశారు. గురుపౌర్ణిమ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.

# బ్యాంకుకు వెళ్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



**పోచారం , జూలై 29 (జనంసాక్షి):** హబ్సిగూడలోని బ్యాంకుకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరిన ఓ వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో పోచారం ఐటీసీ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ 7వ బ్లాక్, రెండో అంతస్తులో నివాసముంటున్న కేడాసు ప్రకాష్ (35) సైట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 2018లో లావణ్యతో వివాహం కాగా, వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం సుమారు 3:35 గంటల సమయంలో హబ్సిగూడలోని బ్యాంకుకు వెళ్లి వెంటనే తిరిగి వస్తానని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన ప్రకాష్ అనంతరం ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన ప్రకాష్ సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉండి, ఇంటి నుంచి బయలుదేరే సమయంలో ఆకుపచ్చ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడని పోలీసులు తెలిపారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోచారం ఐటీసీ పోలీసులు వెల్లడించారు.

# విద్యార్థుల జీవితానికి గురువులే మార్గదర్శకులు

## ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్



**కొడంగల్, జూలై 29 (జనం సాక్షి):** వ్యాస మహర్షి జయంతి సందర్భంగా నవీన ఆదర్శ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా నిర్వహించారు. ముందుగా వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గురువులని పూవుల మాల శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితానికి గురువులే మార్గదర్శకులని గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు డి. లక్ష్మి వెంకటయ్య, ప్రిన్సిపల్ డి.వి. నరేష్ రాజ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా పుష్పగిరి ఉచిత కంటి వైద్య శిబిరం

## మొండివాగులో వందలాది మందికి ఉచిత వైద్య సేవలు



**చేవెళ్ల, జూలై 29 (జనంసాక్షి)** ఎప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మొండివాగులో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చేవెళ్ల కాంగ్రెస్ మాజీ మండల ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ గని సహకారంతో పుష్పగిరి హాస్పిటల్ ఆధ్వర్యంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఉచిత వైద్య సేవలను పొందారు. వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు గ్రామస్తులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక దశలోనే కంటి సమస్యలను గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేయడంతో పాటు కంటిశుక్లం బాధితులను గుర్తించి శస్త్రచికిత్సలకు సిఫారసు చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సలహాలు, తదుపరి చికిత్స సౌకర్యం కల్పిస్తామని వైద్య బృందం తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ గని మాట్లాడుతూ.. వ్యాధి తీవ్రరూపం దాల్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడమే ఉత్తమ రక్షణ అని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం క్రమం తప్పకుండా కంటి వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్, కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, మండల నాయకులు గిరిధర్ రెడ్డి, పడాల రాములు, మధుసూదన్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, టేకులపల్లి శ్రీనివాస్, వైద్యులు యశ్వంత్, త్రివేణి, శివ మెడికల్ సిబ్బంది ఫయాజ్ ఖాన్ , అహ్మద్ అజీమ్, గ్రామ పెద్దలు వినియోగించుకున్నారు.



## ఘనంగా బిజెపి మండల ప్రవాస్ అభియాన్

**మర్పల్లి జూలై 29 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రవాస్ అభియాన్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మర్పల్లి బిజెపి మండల అధ్యక్షులు పి. రామేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దింటి నవీన్ కుమార్ హాజీరై మాట్లాడుతూ  బూత్ స్థాయి సమీక్ష సిరిపురం గ్రామంలోని 5 బూత్‌లలో ప్రవాస్ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రతి బూత్ పరిధిలోని పార్టీ బలాబలాలు స్థానిక ప్రజల సమస్యలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే మూలస్తంభాలని, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత శక్తివంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి, ఎర్రోళ్ల లక్ష్మయ్య, బలరాం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల్లో చిన్నారుల ప్రతిభా ప్రదర్శన

### పల్లవి కిడ్జ్ స్కూల్‌లో ఘనంగా ప్రత్యేక కార్యక్రమం



**చేవెళ్ల, జూలై 29 (జనంసాక్షి)** గురుపౌర్ణమి సందర్భంగా చేవెళ్లలోని పల్లవి కిడ్జ్ స్కూల్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నారు. గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞతను చాటుతూ విద్యార్థులు పాటలు, నృత్యాలు, ప్రసంగాలతో అలరించారు. చిన్నారుల ఉత్సాహం, ప్రతిభ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువు గొప్పతనం, విద్య ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గురుపౌర్ణమి వంటి పర్వదినాలు గురువుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించి ఆశీర్వదించారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు విలువలను అలవర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

## కారు డీకొని ఒకరు మృతి



**శామీర్ పేట్, జులై 29(జనం సాక్షి ) :** మద్యం మత్తులో కారు అతివేగంగా నడిపి డీకొట్టగా ఒకరు మృతి చెందిన ఘటన శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన షేక్ జమీల్ అనే వ్యక్తి తన టీవీఎస్ ఎక్సల్ బైక్ పై కిరాణా షాప్ కి వెళ్లి, కిరాణా సామాన్లు తీసుకొని టీవీఎస్ ఎక్సెల్ పై ఇంటికి వెళుతుండగా ఎదురుగా క్షీరసాగరం నుండి లక్ష్మాపూర్ నివాసి అయిన కావలి మల్లేష్  మద్యం మత్తులో తన కారుని అతివేగంగా, నిర్లక్ష్యంగా రాంగ్ రూట్లో నడుపుకుంటూ వచ్చి జమీల్ ను ఢీ కొట్టగా  తలకి తీవ్రమైన రక్త గాయం అయి స్పృహ కోల్పోవడంతో  వెంటనే చికిత్స నిమిత్తం ఆర్. వి. యం. హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే చనిపోయాడు.  మృతుని కొడుకు పిర్యాదు మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గల్లంతైన బాలయ్య ఆచూకీని త్వరగా కనిపెట్టండి : అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, జూలై 29 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్పేట్ డివిజన్ పరిధి వైశాలి నగర్ వద్దవున్న రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు మంగళవారం సాయంత్రం నాలాలో గల్లంతైన వ్యక్తి బాలయ్య(70) ప్రేమ్ నగర్ వాసి తెలడంతో బుధవారం రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది. గల్లంతైన వ్యక్తికోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని పోలీసు, హైడ్రా, ఎన్డిఆర్ఎఫ్, సిఎంసి ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులకు ఆయన సూచించడం జరిగింది. అనంతరం బాలయ్య కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ వైశాలి నగర్ రైల్వే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్ బాలయ్య జరిపడటం చాలా బాధారమైన విషయం అని, సంఘటన చోటు చేసుకోవడం చాలా దురదృష్టకరమన్నారు. గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలను వేగవంతం చేయాలని ఆయా విభాగాల అధికారులను అరికెపూడి గాంధీ ఆదేశించినట్లు వివరించారు. అర్ధరాత్రి రెండు గంటలవరకు నాలా ఔట్ లెట్ మరియు చెరువు ఇన్ లెట్ ఔట్ లెట్ లను



క్షుణ్ణంగా స్వయంగా ప్రత్యక్షంగా దగ్గరుండి పరిశీలించడం జరిగిందని, ఒక మంచి కార్యక్రమం కోసం ఇలాంటి ఎదురుచూపు సంతోషమేనని, కానీ ఒక కుటుంబం శోకం కోసం ఇలా నిరీక్షించడం చాలా బాధించిందన్నారు. గాలింపు చర్యలను ముమ్మరం చేశామని, అన్నిరకాల చర్యలు తీసుకున్నామని, శాయశక్తుల కృషి చేస్తున్నామని, ఆచూకీ లభించేవరకు గాలింపు చర్యలను కొనసాగిస్తామని బాలయ్య కుటుంబ సభ్యులకు అరికెపూడి గాంధీ భరోసానిచ్చారు. వర్షాలపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలందరూ బయటకు రాకూడదని సూచించారు. అధికారులు కూడా వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో రక్షణ చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించకూడదు అని పిఏసి చైర్మన్ స్పష్టం చేశారు. గల్లంతైన బాలయ్య కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కలిగించేలా అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందేలా చూస్తానని, తన వంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని గాంధీ వారికి తెలియజేశారు.

## దశల వారీగా గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్

**మొయినాబాద్, జూలై 29, జనంసాక్షి:** గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు వెళ్తామని గ్రామానికి మరింత అభివృద్ధి చేస్తామని భాకరం జాగీర్ గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలోని 4,5 వార్డులలో  ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మరియు వార్డు సభ్యుల తో కలిసి సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుస్పలత, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్,బంధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ అధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలి

### మండల బీఆర్ఎస్  జనరల్ సెక్రెటరీ నరసింహ గౌడ్ డిమాండ్



**మొయినాబాద్ జూలై 29(జనంసాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్య క్ష పదవిని ఈసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి కేటాయించాలని నేను 2013నుండి బి ఆర్ ఎస్ పార్టీ లో మొయినాబాద్ మండల జనరల్ సెక్రెటరీ గా ఉంటున్నాను మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాను కనుక అధిష్టానం నన్ను గుర్తించి నాకు అధ్యక్ష పదవి ఇవ్వాలని మనస్ఫూర్తిగా అధిష్టానాన్ని కోరుకుంటున్నాను మండల బీ ఆర్ఎస్  జనరల్ సెక్రెటరీ నరసింహ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పార్టీ అధ్యక్ష పదవిని గతంలో మూడుసార్లు ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అప్ప గించారని వచ్చే ఎన్నికల్లో బీసీలకే ఇవ్వాలని కోరారు తాను కూడా మున్సిపల్ అధ్యక్ష పదవి రేసులో ఉన్నానని, పార్టీని నమ్ముకుని సంవత్సరాలుగా పనిచేస్తున్నానని అధిష్టానం గుర్తించి ఇవ్వాలని కోరారు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హరిశ్వర్ రెడ్డి



**బంట్వారం, జూలై 29 (జనం సాక్షి) :** బంట్వారం మండల కేంద్రానికి చెందిన బిర్ల వెంకటేశం ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో గత కొన్ని రోజుల క్రితం ధగ్ధమైంది, ఇట్టి విషయాన్ని తెలుసుకున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు హరిశ్వర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి ఏ అవసరం ఉన్న నా వంతుగా సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పోచారం వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలంపల్లి శ్రీనివాస్, విద్యాసాగర్, వెంకటేశం, రమేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల సూచన, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల జులై 29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాలాల పోలీస్ స్టేషన్ ఎస్.ఐ  విఠల్ రెడ్డి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ అప్రమత్తంగా ఉండండి - సురక్షితంగా ఉండండి అంటూ పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.పోలీసులు ఇచ్చిన ముఖ్య సూచనలు ! సురక్షితమైన భవనంలో ఉండండి, బలహీన మైన ఇళ్లు, కూలిపోయే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఉండ కుండా పటిష్టమైన భవనాల్లోనే నివసించాలని సూచిం చారు.వరదలో ఉన్న రహదారులను దాటవద్దు, రోడ్లపై నీరు నిలిచి ఉంటే వాహనాలతో గానీ, కాలినడకన గానీ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రాణ హానికి దారితీస్తుందని తెలిపారు.చెట్ల కిందకు వెళ్లవద్దు, ముఖ్యంగా రైతులు పొలాల వద్ద పని చేసేటప్పుడు చెట్టు కింద నిలబడటం చాలా ప్రమాదమని చెప్పారు. ఉరుములు, మెరుపుల సమయంలో ఇది ప్రాణాంతకం కావచ్చని వారు పేర్కొన్నారు.విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో కరెంట్ స్తంభాలను అస్సలు తాకవద్దని, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని పోలీసులు కోరారు.ఎలాంటి అత్యవసర పరిస్థితి ఉన్నా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్.ఐ విఠల్ రెడ్డి సూచించారు. వర్షాలు తగ్గేంత వరకు ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, ప్రభుత్వ సూచనలు పాటించాలని  కోరారు.



# గురు పౌర్ణమి సందర్భంగా అన్నదానం



**కీసర (జనంసాక్షి) :** గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లి పరిధిలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హేమచంద్ర స్టీల్ ట్రేడర్స్ అధినేత శృంగారపు నాగేశ్వరరావు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గురువుల ఆశీస్సులు, దైవానుగ్రహం సమాజాభివృద్ధికి దోహదపడ తాయని అన్నారు. అన్నదానం అన్ని దానాల్లో గొప్పదని, ఆకలితో ఉన్న వారికి భోజనం పెట్టడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, వీర శంకర్, నాగేశ్వరావు, వెంకన్న, నరేష్ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ కరెన్సీ మాయాజాలం.. 9 కోట్లకు టోకరా..!

## నెలవారీ భారీ లాభాల పేరుతో పెట్టుబడిదారులకు గాలం

## 25 మందికి పైగా బాధితులు.. అసలు డబ్బు కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు



**ఆర్మూర్,జూలై 29(జనంసాక్షి):** డిజిటల్ కరెన్సీ మోసాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి.లక్షల్లో పెట్టిన పెట్టుబడికి తక్కువ సమయంలో ఎక్కువ లాభార్జన గడించవచ్చని ఉద్దేశంతో చేసిన దందా కాస్త చివరకు నిరాశ మిగులుస్తుంది.బిట్ కాయిన్ రూ.లక్ష పెట్టుబడితో రూ.16 వేలు నెలకు ఈజీ మనిగా సంపాదించవచ్చని చివరికి మోసానికి గురవుతున్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో బిట్ కాయిన్ తో లక్షల్లో ఆశ చూపి ఇద్దరితో మొదలైన డిజిటల్ లావాదేవీలు 25 మంది వరకు చేరి మోసపోయామని తెలిసి చివరికి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది.బిట్ కాయిన్ రూపంలో పెట్టిన పెట్టుబడులు మోసపోయిన మొత్తం కాస్త రూ.9 కోట్ల పైచిలుకుగా ఉండన్నట్లు తెలిసింది.ఆర్మూర్ డివిజన్ ప్రాంత పరిధిలోని వారే కాకుండా జగిత్యాల, కరీంనగర్ వరకు బాధితులు ఉన్నట్లు తెలిసింది.ఒక బిట్ కాయిన్ డిజిటల్ లావాదేవీ ఐడీకి రూ.50 వేలు జాయినింగ్ ప్రక్రియగా మొదలవుతుంది.ఇందులో ప్రధాన పాత్ర దారులు లక్షల్లో పెట్టుబడి పెట్టించి లాభాలను నెలవారిగా అందరికీ పంచారు.లాభాలు అధికంగా రావడంతో అది కాస్త ఒక్కో ట్రాన్జక్షన్ లక్షల మూటగా పెట్టుబడులు పెట్టారు.కొన్ని నెలల తర్వాత చైన్ సిస్టం లాంటి ప్రక్రియ ఉండడంతో కొందరికి నష్టాలను మిగిల్చాయి.బిట్కాయిన్ ద్వారా పెట్టిన లాభాలు అర్జించినప్పుడు,నష్టాలను భరించాల్సిన పెట్టుబడిదారులు భరించలేక ప్రధాన పాత్రధారులపై ఒత్తిడి తెస్తూ విషయం కాస్త బయటకు పొక్కింది.బిట్ కాయిన్ లో చేరిన వేళ కట్టిన రూ.50 వేలు,పెట్టుబడిలా పెట్టిన మొత్తం ఇప్పించాలని ప్రధాన పాత్రధారుడు చుట్టూ కాళ్లు అరిగేలా బాధితులు తిరుగుతున్నారని వినికిడి.డిజిటల్ లావాదేవీల ప్రధాన పాత్రధారులు ఆర్మూర్ డివిజన్ లోని వ్యక్తి కాగా,మరొకరు ఇంకో ప్రాంతానికి చెందిన వారిగా తెలిసింది.గతంలో ప్రధాన పాత్రధారుడు లాభాల రూపంలో డబ్బులు ఇచ్చామని చెప్తే, బయట వడ్డీలకు డబ్బులు ఇస్తే అంతే వస్తుందని వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది.తాము కట్టిన డబ్బులు అసలు మొత్తం వడ్డీతో సహ కట్టాలని డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్ కు బాధితులు చేరుకున్నట్లు తెలిసింది.క్రిప్టోకరెన్సీ లావాదేవీలకు అధికారిక గుర్తింపు లేకపోవడం గమనార్హం.ఐతే ఇట్టి లావాదేవీలకు చెక్ పెడుతూ మరి పోలీసు ఉన్నతాధికారులు ఏలాంటి చర్యలు తీసుకోవాలంటారో వేచి చూడాల్సిందే.

# జీవితం అమూల్యం.. సమస్యలు తాత్కాలికం

రోజురోజుకూ సమాజంలో వినిపిస్తున్న ఆత్మహత్యల వార్తలు కలవరపెడుతున్నాయి. ఒకప్పుడు అరుదుగా కనిపించే ఈ ఘటనలు ఇప్పుడు దాదాపు ప్రతి వయసు, ప్రతి వర్గం, ప్రతి వృత్తిలో కనిపిస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, గృహిణులు, యువత, వృద్ధులు ఎవ్వరూ ఈ సమస్యకు అతీతులు కారు. సాంకేతికంగా ప్రపంచం ఎంతో ముందుకు సాగింది. సమాచార విప్లవం, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష విజయాలు, డిజిటల్ జీవనం అన్నీ మనిషి జీవితాన్ని సులభతరం చేశాయి. కానీ అదే సమయంలో మానసిక ఒత్తిడి, ఒంటరితనం, పోటీ, అంచనాలు కూడా పెరిగాయి. ఫలితంగా ఎదురయ్యే చిన్న సమస్యలను కూడా భరించలేని పరిస్థితికి కొందరు చేరుకుంటున్నారు. ఆత్మహత్యకు ఒకే ఒక్క కారణం ఉండదు. అనేక వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక, మానసిక అంశాలు కలిసి ఒక వ్యక్తిని తీవ్ర నిరాశలోకి నెట్టవచ్చు. చాలా సందర్భాల్లో సమస్య కంటే "దీనికి పరిష్కారం లేదనే భావన" ప్రమాదకరంగా మారుతుంది. విద్యార్థుల్లో పెరుగుతున్న ఆందోళన నేటి విద్యా వ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, ప్రవేశ పరీక్షలు, పోటీ పరీక్షలు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలు, సమాజం చూపే పోలికలు, సోషల్ మీడియా ప్రభావం, తోటి విద్యార్థుల విజయాలతో తమను తాము తక్కువగా భావించడం వంటి కారణాలు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఒక పరీక్షలో విఫలం కావడం అంటే జీవితం విఫలమైనట్లు కాదు. చరిత్రలో ఎంతో మంది గొప్ప వ్యక్తులు మొదటి ప్రయత్నంలో విజయం సాధించ లేదు. వైఫల్యం ఒక పాఠం మాత్రమే అది జీవితానికి ముగింపు కాదు. విద్యార్థులే కాదు ఉద్యోగులు, అధికారులు సైతం ఎదుర్కొంటున్న ఒత్తిడికి గురవుతున్నారు. ఉద్యోగ జీవితంలో పనిభారం, లక్ష్యాల ఒత్తిడి, పై అధికారుల ప్రవర్తన, ఉద్యోగ భద్రతపై భయం, కుటుంబ బాధ్యతలు కలిసి మానసిక ఒత్తిడిని పెంచుతాయి. కొందరు తమ సమస్యలను ఎవరికీ చెప్పకుండా మనస్సులోనే దాచుకుంటారు. ఈ మౌనం క్రమంగా తీవ్ర నిరాశకు దారితీయవచ్చు. ఉద్యోగం కోల్పోతే మరో ఉద్యోగం వెతుక్కోవచ్చు. కానీ జీవితాన్ని కోల్పోతే తిరిగి పొందలేం. అందుకే సమస్యలను పంచుకోవడం, అవసరమైతే సెలవు తీసుకోవడం, వృత్తిపరమైన సహాయం పొందడం బలహీనత కాదు బాధ్యత అనే విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. కుటుంబాల్లో సైతం మారుతున్న సంబంధాలు కుటుంబం అనేది మనిషికి మొదటి అండ. కానీ అదే కుటుంబంలో అపార్థాలు, ఆర్థిక ఇబ్బందులు, భార్యాభర్తల మధ్య విభేదాలు, అత్తా–కోడళ్ల సమస్యలు, పిల్లలతో దూరం, సక్సెస్ అవ్వలేదని వంటి అంశాలు మానసిక వేదనకు కారణమవుతున్నాయి. ప్రతి ఇంట్లో అభిప్రాయ భేదాలు సహజం. మాట్లాడుకుంటే పరిష్కారం దొరకని సమస్యలు చాలా తక్కువ. పరస్పరం వినడం, అర్థం చేసుకోవడం, గౌరవించడం కుటుంబ బంధాలను బలపరుస్తాయి. మీరు మారలేము, ఎదుటివారిని మార్చ లేమనుకుంటే కుటుంబం నుంచి విడిపోయి ఎవ్వరికి వాళ్ళు ఉంటూ, ఎక్కడైనా కలసినప్పుడు మంచిగా మాట్లాడుకుంటూ ఉండడం కూడా ఒక మార్గమే. ప్రేమ, నిరుద్యోగం, ఒంటరితనం యువతలో ప్రేమలో విఫలం కావడం, నిరుద్యోగం, భవిష్యత్తుపై అనిశ్చితి, సోషల్ మీడియాలో ఇతరుల జీవితాలతో తమను పోల్చుకోవడం వల్ల ఆత్మన్యూనత భావం పెరుగుతోంది. ప్రేమ జీవితంలో ఒక భాగం మాత్రమే మొత్తం జీవితం కాదు. మీ ప్రేమను వదులుకునేందుకు వాళ్ళు సిగ్గుపడేలా, తలదించుకునేలా బ్రతకండి. మీ తల్లిదండ్రుల కష్టాలను తలచుకోండి మీకు ఏ ప్రేమ గొప్పదో కూడా తెలుస్తుంది. అలాగే ఉద్యోగం దొరకకపోవడం, ఆలస్యమవడం లాంటివి ఎదురైతే అవకాశాలు ముగిసిపోయినట్లు కాదు. ప్రతి ఒక్కరి జీవితం విభిన్న ప్రయాణం, చదివిన చదువుకే ఉద్యోగం అంటే చదివిన ప్రతివారికి ఉద్యోగాలు దొరకవు. చదువు విజ్ఞానం పెంచడానికి, ఉద్యోగం అనేది ప్రయత్నం మాత్రమే. బ్రతకడానికి అనేక మార్గాలున్నాయి, ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవాలి అందరికి ఆదర్శంగా ఉండేలా బ్రతికి చూయించాలి. మరోవైపు రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సవాళ్లు రైతులకు ప్రకృతి వైపరీత్యాలు, అప్పులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యాపారులకు ఆర్థిక నష్టాలు, మార్కెట్ ఒడిదుడుకులు తీవ్రమైన ఒత్తిడిని కలిగిస్తాయి. రైతులు ప్రత్యయమార్గాలలో వేరే పంటలసాగు చేయాలి, వ్యాపారస్తులు చేస్తున్న వ్యాపారంలో నష్టం వస్తే మరో వ్యాపారం వైపు దృష్టి పెట్టాలి. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నారు షేర్ మార్కెట్ అనేది ఒక మాయ ప్రపంచంలాంటిది ఉన్నది లేనిది లేనట్టు చూస్తుంది, అత్యాశకు వెళ్లి సర్వం పోగొట్టుకుంటున్నారు, ఒక్కసారి నష్టపచ్చినప్పుడు మరోమార్గంలో అన్వేషించాలి, పోయిన వద్దనే వెతుకోవడమంటే మిమ్మల్ని, మీరు మోసం చేసుకోవడమే అవుతుంది. సినిమాలో సక్సెస్ అవ్వలేదని, మోడీలింగ్ రంగంలో గుర్తింపు రాలేదని, సమాజంలో గుర్తింపు రాలేదని, సోషల్ మీడియాలో ఫాలోయర్స్ లేరు అని, లైక్స్ లేవని, ఎవ్వరో ఎదో కామెంట్ చేసారు అని ఇలా అనేక కారణాలతో జీవితాలను వదిలేసుకుంటున్నారు, ఒక్క రంగం కాకపోతే మరోరంగం ప్రపంచం చాల విశాలమైనది, విస్తరించి ఉన్నది అనేది విషయాన్ని గుర్తెరగాలి, వత్తిడికి గురైన సందర్భంగా మనస్సులో బాధను నమ్మకమైనవారితో షేర్ చేసుకోవడం మిమ్మల్ని మీరు రక్షించుకున్నట్టే అవుతుంది. ఆత్మహత్యల నివారణకు కుటుంబ సహకారం, ప్రభుత్వ అవకాశాలు, ఆర్థిక సలహాలు, సామాజిక మద్దతు ఎంతో అవసరం. బలవన్మరణాల నివారణకు అందరి పాత్ర అవసరమే. ఆత్మహత్యల నివారణకు ఒక్క ప్రభుత్వ చర్యలు సరిపోవు. కుటుంబం, పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ సంస్థలు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సమాజం అందరూ కలిసి పనిచేయాలి. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడాలి. ఉపాధ్యాయులు దండనకు, మార్కులకే కాకుండా విద్యార్థుల భావోద్వేగాలను కూడా గుర్తించాలి. కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యానికి అనుకూల వాతావరణం ఉండాలి. మీడియా సంచలనాత్మక కథనాల కంటే అవగాహన పెంచే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించాలి. కష్టాల్లో ఉన్నప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం కోరడం సహజం. అది బలహీనతకు కాదు, సమస్యను ఎదుర్కొనే ధైర్యానికి నిదర్శనం. జీవితంలో కష్టాలు, వైఫల్యాలు, అవమానాలు, నష్టాలు ఇవన్నీ ఏవి శాశ్వతం కావు. కాలం మారినట్లు పరిస్థితులు కూడా మారతాయి. ఈ రోజు అసాధ్యంగా కనిపించే సమస్య రేపు ఒక జ్ఞాపకంగా మారవచ్చు. అందుకే క్షణికావేశంలో శాశ్వత నిర్ణయం తీసుకోవద్దు. మీ చుట్టూ బాధలో ఉన్నవారిని గమనించండి, వారికి తీర్పు ఇవ్వకుండా ఓపికగా వినండి, వాళ్లలో సగం మనస్సుభారం తగ్గుతుంది, అవసరమైనప్పుడు అండగా నిలబడండి, ఒక ఆప్యాయమైన పలకరింపు, కొంత సమయం, దూరంగా ఉన్నవాళ్లకు ఒక ఫోన్ కాల్ వాళ్లకు భరోసా, నేను ఉన్నాను అని చెప్పే మాట కొన్నిసార్లు ఒక ప్రాణాన్ని కాపాడగలవు. ఉన్నది జీవిస్తున్న జిందగీ ఒక్కటే, జిందగీని ప్రేమించండి సమస్యలను కాదు, మీ జిందగీ మీకే కాదు మీ కుటుంబానికి, సమాజానికి కూడా ముఖ్యమే. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది వెతికేయండి ధైర్యంగా నమ్మకంతో జీవితాన్ని సాగించండి.






**వై. సంజీవ కుమార్**
ఫౌండర్, ప్రెసిడెంట్, స్కై ఫౌండేషన్,
9393613555, 9493613555